# ముళ్లు కాల్చిన దారి

ఆ ఉదయం పదకొండింటికి మా ఇంటి ముందు ఆగిన కారులోంచి కనకయ్య దిగడం చూస్తానని అనుకోలేదు.

అప్పటికి అతనిని చూసి పది సంవత్సరాలు పయిగానే అయింది. అంతకు ముందు ఎప్పుడో ఒకసారి మా ఇంటికి వచ్చాడు. చేయంత ఎత్తు మనిషి. మునుపటికన్నా చిక్కిపోయాడు. అతని రాక ఎంతో సంతోషం కలిగించింది. మూడేళ్ళపాటు కార్గిల్ సెక్టార్‌లో ఒకే యూనిట్‌లో చావుబతుకుల మధ్య కలిసి పనిచేశాం. మంచివ్యక్తి. ధైర్యస్తుడు. రెండుసార్లు నేను ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు అతను గనక ఆదుకుని ఉండకపోతే తూటాలకు బలయిపోయి ఉండేవాడిని. అతను రక్షించింది నన్ను ఒక్కడినే కాదు. మరో నలుగురయిదుగురిని తెగించి కాపాడాడు. ప్రభుత్వం తరుపున అతనికి ఏదయినా అవార్డు వస్తుందనుకున్న వాళ్లలో నేనూ ఒకడిని. వచ్చినట్టులేదు. కొన్నాళ్ళపాటు నన్ను బేస్ ఆస్పత్రిలో ఉంచి పీస్ స్టేషన్‌కు బదిలీ చేశాక అతని సమాచారం తెలియలేదు. అప్పటి తర్వాత ఇప్పుడే అతన్ని మళ్ళీ చూడడం.

సోఫాలో కూర్చున్నాక, "మీ ఊరి చందువా చేపలు, రొయ్యలు తిని వెళ్దామని వచ్చాను" నవ్వుతూ అన్నాడు.

అప్పటినవ్వే, ఏ మార్పూ లేదు. చలికాలంలో చందువాలు ఎక్కువ దొరుకుతుంటాయి. రొయ్యలు మునుపటిలా దొరకడం లేదు. పెద్ద సయిజువన్నీ ఎగుమతి చేయడానికి పంపించేస్తున్నారు. మా అబ్బాయిని బజారుకు పంపించి, అతనితో కబుర్లలో పడిపోయాను. అతను వయసులో నా కంటే చిన్నవాడే అయినా తెలివి గలవాడు. ఐ.టి.ఐలో డిప్లొమా చేశాడు. నేను సుబేదారుగా పదవీ విరమణ చేశాను అతను పదవీ విరమణ చేసేటప్పటికి ఏ రేంకు ఇచ్చారో అడుగుదామనిపించింది. అడగలేదు. భోజనాలు చేశాక కూడా అప్పట్లో మా యూనిట్‌లో పనిచేసిన ఒకొక్కరినీ గుర్తు తెచ్చుకుంటూ వాళ్ల గురించి మాట్లాడుకుంటూ ఉండిపోయాం. చాలా సంవత్సరాల తర్వాత కలుసుకోవడం వలన మాటలు అలా

బి.పి.కరుణాకర్

కదిలిపోతున్నాయి. తెగడం లేదు. ఎందుకో తెలియదు కాని జీవితంలో అతన్ని మళ్ళీ చూస్తానని నేను అనుకోలేదు.

సాయంత్రం అతను వచ్చిన కారులోనే బాపట్ల శివారులోని సూర్యలంక బయల్దేరాం. డ్రయివరును వెనక కూర్చోమని చెప్పి, కారు నేను డ్రయివ్ చేయడం మొదలుపెట్టాను. కనకయ్య నా పక్కనే కూర్చున్నాడు. ఇంట్లో ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకున్నాం కాని అతని స్వవిషయాల గురించి నేను అడగలేదు. అతనూ చెప్పలేదు. మేం కలిసి పనిచేసేప్పుడు కూడా తన విషయాలు ఎప్పుడూ చెప్పలేదు. అతనికి తల్లిదండ్రులు, దగ్గరవాళ్ళు ఉన్నట్లు నాకు అనిపించలేదు. మెస్‌లో కూర్చుని రమ్ తాగుతూ మంచి మూడ్‌లో ఉన్నప్పుడు మటుకు మూడు నాలుగుసార్లు 'నాగేంద్రం మంచిది గురూ' అన్నాడు. అంతకుమించి ఆమె గురించి నాతో మరో మాట అనలేదు.

"పెళ్ళి చేసుకున్నావా?" అడిగాను.

తల అడ్డంగా ఆడించి, "లేదు, చేసుకోలేదు" అన్నాడు.

కొద్దిసేపు ఆగి, "కొన్నాళ్ళ పాటు ఎల్.ఐ.సి. ఉద్యోగంలో చేసి మానేశాను. తర్వాత చిన్న ఫోర్జింగ్ కంపెనీ పెట్టాను. సంవత్సరం పాటు నష్టాల్లో నడిచింది. మంచి ఉద్యోగం మానుకుని ఇందులో దిగానేమిటి అని బాధపడుతూ కంపెనీ మూసేద్దామన్న సమయంలో వ్యాపారం పుంజుకుంది. వెనక్కి తిరిగి చూడలేదు. ప్రస్తుతం నా దగ్గర ఇరవయి అయిదు మంది వర్కర్లు ఉన్నారు. ఎప్పటికప్పుడు ఆర్డర్లు వస్తున్నాయి. ఏ ఒడిదుడుకులు లేకుండా సవ్యంగా సాగిపోతోంది. పెన్షను వస్తోంది. రెండు కార్లు కొనుక్కున్నాను. ఒకటి నేను ఉపయోగించుకుంటున్నాను. మరొకటి కంపెనీ పనులకని పెట్టాను. సొంతిల్లు కట్టుకున్నాను. జీవితంలో అన్నీ ఉన్నాయి. జీవితమే లేదు. అందరికీ అలా ఉండదనుకుంటాను. మునుపు లేదు కాని ఇప్పుడిప్పుడే విసుగు పుడుతోంది" ఆగాడు.

నాకు తెలిసిన కనకయ్య మాటల్లో మార్పు కనిపిస్తోంది. సిగరెట్లు మటుకు మానలేదు. మునుపటికన్నా ఎక్కువగా కాలుస్తున్నట్లుంది. పెదాలు బాగా నల్లబడ్డాయి.

"ఆర్మీ నుండీ నువ్వెప్పుడు డిశ్చార్జ్ అయ్యావు?" అడిగాడు.

సాయుధ దళాల్లో పదవీ విరమణ రాసిన బాండు ప్రకారం ఉంటుంది. రేంకు ప్రకారం కూడా ఉంటుంది. యుద్ధం జరుగుతున్నప్పుడే భయానకంగా ఉంటుంది. ఎప్పుడు ఏమవుతుందో తెలియదు. మన పక్కన కూర్చుని బంకరులో మాట్లాడుతున్న వ్యక్తి తూటాకు ఎప్పుడు బలయిపోతాడో తెలియదు. పీస్ సమయంలో సరిహద్దుల్లో

జరిగే చెదురుమదురు సంఘటనలు మినహా జీవితం బాగానే ఉంటుంది.

"అయిదు సంవత్సరాలు దాటాయి. స్టేట్ బేంకులో ఉద్యోగం ఇచ్చారు. చీకూచింతా లేకుండా జీవితం గడిచిపోతుంది" అన్నాను.

చీకటి పడేవరకు సముద్రపు ఒడ్డున కూర్చుని చాలా సంగతులు మాట్లాడుకుంటూ ఉండిపోయాం. చివరకు లేచి కారు నిలిపిన చోటకు వస్తున్నప్పుడు, "రెండు మూడు రోజులపాటు మా ఇంట్లో ఉండు" అన్నాను.

"ఈసారి వచ్చినప్పుడు రెండు మూడు రోజులేమిటి? రెండు వారాలపాటు ఉంటాను" అన్నాడు.

భోజనం చేసి రాత్రి ఎనిమిదింటికి బయల్దేరబోతూ, "పెదనందిపాడు వరకు వెళ్ళి రావాలి... కూడా వస్తే సంతోషిస్తాను. తోడుంటే కబుర్లలో ప్రయాణం చేసినట్టుండదు. వచ్చేప్పుడు నిన్ను బాపట్లలో క్షేమంగా మీ ఇంట్లో వదిలిపెట్టి వెళ్తాను" అన్నాడు.

" సరే" అన్నాను.

కారు నేనే డ్రయివ్ చేస్తూ పెదనందిపాడు తీసుకువెళ్లాను. కనకయ్య, అటు రావడం కొత్తలా అనిపించినా ఒక అయిడియా ఉన్నట్టనిపించింది. అక్కడ ఎవరిని చూడడానికి వెళ్తున్నాడో నేను అడగలేదు. అతను చెప్పలేదు. ఊరి చివరకు వచ్చాక వంతెన పక్కగా కారాపమన్నాడు. రోడ్డు పక్కగా కారు ఆపాను. అతను కారు దిగి డిక్కీలోంచి మంచిగా పేక్ చేసిన పెద్దసంచి బయటకు తీస్తోంటే, నేనూ దిగి అతని పక్కనే నిలబడి సహాయం చేయబోతోంటే, "మోయగలను, అంత బరువేమీ లేదు" అన్నాడు.

అని డిక్కీ మూసి, రెండడుగులు ముందుకు వేసి, వెనకకు తిరిగి నా వంక చూడకుండా, "ఈ సంచి నాగేంద్రానికిచ్చి వచ్చేస్తాను" అన్నాడు. అతని మాటల్లో నర్వస్‌నెస్ కనిపించింది.

"నాగేంద్రం ఇక్కడ ఉంటోందా?" అడిగాను.

"ఈ చుట్టుపక్కల ఉంటోందని విన్నాను. ఎక్కడో సరిగ్గా నాకే తెలియదు. కనుక్కుంటాను."

"తోడుగా నేనొచ్చేదా?"

"వద్దు" ముందుకు వెళ్ళిపోయాడు.

డ్రయివరు కారులో నిద్రపోతున్నాడనుకుంటాను. బయటకు రాలేదు. కారుకు

అనుకుని నిలబడి సిగరెట్ వెలిగించాను. చల్లటిగాలి చిక్కబడుతోంది. స్వెట్టర్ తెచ్చుకుని ఉంటే బావుండేది. కనకయ్య ఎన్ని సంవత్సరాల తర్వాత నాగేంద్రాన్ని చూస్తున్నాడో? చాలా సమయం తీసుకుంటాడేమో అనిపించింది.

పావుగంటకన్నా ముందే తిరిగి వచ్చేశాడు. చేతిలో సంచి లేదు.

"ఇబ్బందేమీ కలగలేదు కదా?" అడిగాను.

"లేదు... లేదు.. సిగరెట్ ఉందా?" అడిగాడు.

ఇచ్చాను. లయిటర్‌తో సిగరెట్ వెలిగించుకుంటోంటే అతని చేతి వేళ్ళు వణకడం గమనించాను. కొత్త వ్యక్తిని చూస్తున్నట్టుగా అనిపించింది.

కార్లో కూర్చున్నాక, నా పక్కనే కూర్చుని తలుపు వేశాడు. కారు నడపడం మొదలెట్టాను. దారే ఇబ్బందిగా ఉంటుంది కాని వేగంగా నడపటం కష్టంగా ఉంటుంది. మామూలు వేగంలోనే నడుపుతున్నాను. అతనేమయినా మాట్లాడితే బావుం దనిపిస్తోంది.

చివరంటా కాలిన సిగరెట్‌తో మరో సిగరెట్ ముట్టించుకుని, "నీకు శ్రమ ఇస్తున్నాను." అన్నాడు.

"శ్రమ ఏమీ లేదు."

"నాగేంద్రం గురించి నీకెప్పుడూ చెప్పలేదు."

అవునన్నట్లు తలూపాను.

"నిజానికి నాగేంద్రం చాలా మామూలుస్త్రీ. పెద్ద అందగత్తె కాదు. మాటకారి కూడా కాదు. నేను నాలుగు మాటలు మాట్లాడితే ఒక్కమాట తిరిగి మాట్లాడుతుంది. నాకంటే అయిదారేళ్ళు చిన్నది. నాకు బంధువు కాదు. మా ఇద్దరికీ ఎలా పరిచయం అయిందో నాకు గుర్తు లేదు. ఆమెలో నాకు నచ్చింది చక్కటి నవ్వు. ఒకానొకప్పుడు ఆ నవ్వులో కొట్టుకుపోయాను. సంతోషం మన జీవితాల్లో ప్రధానమయినదయినా మనల్ని వదలకుండా అంటి పెట్టుకుని ఉండదు...

"ఆమె నాకు బంధువు కాదన్నాను కాని అంతకంటే ఎక్కువ. నా మనిషయి ఉండేదేమో! ఆమెను ప్రేమించి ఉంటాను.. కాదు.. ప్రేమించాను. ఎక్కడో చదివాను, ప్రేమలో పడిన ప్రతి వ్యక్తికి రవంత పిచ్చి తప్పకుండా ఉంటుందట. ఆ పిచ్చికి బలమయిన కారణం కూడా ఉంటుందట. నా విషయంలో ఉంది. నేను కార్గిల్‌కు బయల్దేరినప్పుడు నేను ఊహించలేదు, నాకు వీడ్కోలు చెప్పడానికి, రైల్వేస్టేషన్‌కు వచ్చింది. చాలా సంతోషం వేసింది. 'నీతో మాట్లాడదామని వచ్చాను' అంది. నిజంగా

నాకూ ఆమెతో ఏదేదో మాట్లాడాలని ఉంది. బండి బయల్దేరే వరకు తనేం మాట్లాడలేదు. గొంతు పెగల్చుకుని నాకూ మాటలు రాలేదు. నేను ఇప్పటికీ మర్చిపోలేని కారణం ఏమిటంటే బండి కదిలి, వేగం అందుకుంటోంటే నేను కూర్చున్న కంపార్టుమెంటుతో చాలా వేగంగా పరుగెడుతూ ప్లాటుఫాం చివరికంటా వచ్చింది. తనలా పరుగెడుతున్నప్పుడు ఎక్కడ పడిపోతుందేమోనని భయపడ్డాను. తర్వాత నాగేంద్రాన్ని నా మనసులోంచి తీసివేయలేకపోయాను."

"ఇందాక నిన్ను చూసి ఏమంది?" అడిగాను.

"వాళ్ళింటికి వెళ్లాను. ప్రహరీగోడ తలుపు తీస్తున్న చప్పుడుకు ఆమె ఇంట్లోంచి బయటకు వచ్చి వరండాలో నుంచుంది. పలచటి దీపపు వెలుగులో చూశాను. ఆమె చేతిలో ఒక పాప ఉంది. ఆమె పక్కగా బాబు నిలబడి ఉన్నాడు. వరండాలోని వెలుగు నా వరకు రావడం లేదు. తను నన్నెక్కడ గుర్తుపడుతుందనేమో అరుగు దగ్గరే నిలబడిపోయాను. ఆమెతో ఎన్నోమాటలు మాట్లాడదామని ఊహించుకుని వచ్చిన నాకు గొంతు పెగిలి ఒక్క మాటయినా రాలేదు. తీసుకెళ్ళిన సంచి అరుగుమీద పెడుతోంటే, 'ఆయన లేడు. బజారుకు వెళ్ళాడు' అంది. 'ఆయన కోసం రాలేదు. ఇది నీకిచ్చి వెళ్దామని వచ్చాను. కనకయ్య పంపించాడు' అన్నాను. ఆమె నా కంఠస్వరాన్ని మర్చిపోయిందో, లేదో తెలియదు. ఒహవేళ నన్ను గుర్తుపట్టి ఉంటే ఆమె నూటికి రెండొందల పాళ్ళు గృహిణి. ఎ పర్‌ఫెక్ట్ వైఫ్. 'కనకయ్య లేడుగా, చచ్చిపోయాడు కదా' అంది. 'అంతకు ముందెప్పుడో నీకివ్వమని ఇచ్చాడు. నీ అడ్రసు దొరకక ఆలస్యం అయింది' అన్నాను. 'ఈ సంచిలో ఏమున్నాయి?' అడిగింది. 'నీ కోసం ఏవేవో వస్తువులనుకుంటాను' అన్నాను. ఆమె సంచి అందుకుని ఇంట్లోకి తీసుకువెళ్తోంటే బయటకు వచ్చేశాను. ఆమె నా గురించి ఏ మాత్రం జాలిగా మాట్లాడినా ఆమె కాళ్ళ మీద పడి ఏడ్చేసి ఉండేవాడినేమో!" అని సీటుకు చేరగిలబడి, అద్దంలోంచి రోడ్డు వయిపు చూస్తూ, "అవును కదూ, నేను చచ్చిపోలేదూ?" అడిగాడు. మాటలో బాధకాని దుఃఖం కాని తొణకలేదు.

ఈ మాటకు నాకు దుఃఖం ఆగలేదు. కనకయ్య ఒక కాలు, చేయి లేవు. కార్గిల్ తినేసింది. మనసును నాగేంద్రానికి కోల్పోయాడు. అవును. ఏం మిగిలాడు?

* సాక్షి -ఫన్‌డే, 17 ఏప్రిల్ 2011